## ఇచ్చిన బంగారం అడిగినందుకు..
# చంపుతానని బెదిరింపు

రాంనగర్, నవంబర్ 7: నగరంలోని బ్యాంక్ కాలనీకి చెందిన ఓ మహిళ శుభకార్యం ఉందని స్నేహితురాలి బంగారు ఆభరణాలు తీసుకెళ్లి, తిరిగి అడిగినందుకు చంపుతానని బెదిరించడంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్యాంకు కాలనీకి చెందిన మాడపాటి అరుణ శుభకార్యం ఉందని చెప్పి సమీపంలో ఉండే స్నేహితురాలైన చెన్నమల వరలక్ష్మి దగ్గర గత నెల 22న 4 తులాల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు తీసుకెళ్లింది. తర్వాత తిరిగి ఇవ్వకపోగా అడిగినందుకు వరలక్ష్మిని చంపుతానని బెదిరించింది. ఈ ఘటనపై బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి తెలిపారు.

# తరలింపు సరే.. వసతులేవి?

- కశ్మీర్‌గడ్డ ఈ-సేవకు ఎంప్లాయిమెంట్ ఆఫీస్!
- పై అంతస్తులోని హాల్‌లో ఏర్పాటుకు నిర్ణయం
- ఇక్కడ కనీస సౌకర్యాలు శూన్యం
- మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం కరువే
- వచ్చే యువతకు తిప్పలే



కశ్మీర్‌గడ్డలోని ఈ సేవా భవనం

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 7 : కేవలం మహిళా సంఘాల సమావేశాల కోసం నిర్మించిన భవనంలో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఏర్పాటు చేయాలని కరీంనగర్ జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అయితే, కనీస సదుపాయాలు కల్పించకుండానే తరలిస్తే సిబ్బందితోపాటు నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డలోని ఈ-సేవా కేంద్రం పైఅంతస్తులో గతంలో స్థానిక మహిళా సంఘాలు సమావేశాలను నిర్వహించుకునేందుకు వీలుగా ఒక హాల్, మరొక గది నిర్మించారు. మహిళా సంఘాలు నెలలో ఒక్కటి, రెండు సార్లు తమ సమావేశాలు నిర్వహించేది. అయితే, దానిని ప్రస్తుతం వినియోగించడం లేదు. కాగా, ప్రస్తుతం ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదుట ఉన్న ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌ను ఇక్కడికి తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని జిల్లా న్యాయ విభాగానికి ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో జిల్లా న్యాయ విభాగానికి చెందిన జడ్జిలు, ఇతర అవసరాల కోసం నిర్మాణాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో అక్కడ ప్రస్తుతం ఉన్న ఉపాధి కల్పన కార్యాలయాన్ని తరలించడం తప్పనిసరిగా మారింది. అయితే, కశ్మీర్‌గడ్డలోని ఈ-సేవ కేంద్ర భవనంలో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం కూడా లేవు. కనీసం పార్కింగ్ సదుపాయం కూడా లేదు. ఇలాంటి భవనంలోకి ఈ కార్యాలయాన్ని తరలిస్తే సిబ్బందితోపాటు అక్కడి వచ్చే నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఒక హాల్‌లో కార్యాలయాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టి సారించి సౌకర్యాల కల్పన విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్‌లో



# పట్టభద్రులు, పంతుళ్ల సత్తా





- గ్రాడ్యుయేట్ స్థానానికి 3,58,452 దరఖాస్తులు
- టీచర్ స్థానానికి 27,879..
- చివరి రెండు రోజుల్లో అనూహ్యంగా పెరిగిన ఓటరు నమోదు
- 2019తో పోలిస్తే 1,62,131కి పెరిగిన పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్
- పంతుళ్లలో 4,665 పెరుగుదల
- ఈ నెల 23న ముసాయిదా జాబితా

**కరీంనగర్- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్‌రోల్‌మెంట్‌లో ఇటు పట్టభద్రులు, అటు పంతుళ్లు సత్తా చాటారు. అంచనాలకు మించి ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. ఈ నెల 4 మధ్యాహ్నం వరకు అంతంత మాత్రంగానే ఉన్న నమోదు ప్రక్రియ, రెండురోజుల్లో అనూహ్యంగా పెరిగింది. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు గ్రాడ్యుయేట్ ఎన్‌రోల్‌మెంట్ 3,58,452కి, టీచర్ ఎన్‌రోల్‌మెంట్ 27,879కి చేరింది. అయితే ఈ సంఖ్య మరింత పెరగడానికి అవకాశం ఉన్నది. గడువు ముగిసినా ఇంకా ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే వెసులుబాటు ఉందని ఇప్పటికే అధికార యంత్రాంగం ప్రకటించింది. ఇదే సమయంలో దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించే పనిలో తలమునకలైంది.**

కరీంనగర్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గస్థానంతోపాటు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ సభ్యుల పదవీ కాలం వచ్చే మార్చి 29వ తేదీతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది. అందులో భాగంగా ఓటరు నమోదుకు అవకాశమిస్తూ సెప్టెంబర్ 30న పబ్లిక్ నోటీస్‌ను జారీ చేసింది. అలాగే రెండు దఫాలుగా అక్టోబర్ 16, 25వ తేదీల్లో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. ఆ మేరకు నవంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2019 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారు ఈసారి తప్పనిసరిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. గడువులోగా దాఖలైన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపింది. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 23వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు తెలిపేందుకు అవకాశం ఇచ్చింది. వచ్చే నెల 30న నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు సంబంధించిన తుదిఓటరు జాబితాను వెల్లడిస్తామని చెప్పింది.

**ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు**

| జిల్లా | గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకోసం వచ్చిన దరఖాస్తులు | టీచర్స్ ఎమ్మెల్సీ కోసం వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| కుమ్రం భీం | 5,784 | 473 |
| మంచిర్యాల | 30,656 | 1,693 |
| ఆదిలాబాద్ | 15,028 | 1,531 |
| నిర్మల్ | 17,594 | 1,849 |
| నిజామాబాద్ | 29,523 | 3,573 |
| కామారెడ్డి | 15,256 | 2.171 |
| జగిత్యాల | 234,602 | 1,815 |
| పెద్దపల్లి | 29,566 | 995 |
| కరీంనగర్ | 76,740 | 4,361 |
| రాజన్న సిరిసిల్ల | 22.109 | 948 |
| సంగారెడ్డి | 28,275 | 3,119 |
| మెదక్ | 13,885 | 1,443 |
| సిద్దిపేట | 32,133 | 3,612 |
| హనుమకొండ | 4,653 | 182 |
| జయశంకర్ భూపాల్‌పల్లి | 2.648 | 97 |
| మొత్తం | 3,58,452 | 27,879 |

### సత్తాచాటిన పట్టభద్రులు

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్ ఈ సారి అంచనాలకు మించి జరిగినట్టు తెలుస్తున్నది. ఔత్సాహిక అభ్యర్థులు పోటాపోటీగా నమోదు చేసుకోవడం, ఆ మేరకు అధికారులు కసరత్తు చేయడం వల్లే భారీగా ఎన్‌రోల్‌మెంట్ జరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం పేర్కొన్న ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రితో ముగిసింది. ఆ ప్రకారం చూస్తే.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 3,58,452 మంది పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 27,879 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిజానికి ఈనెల 4 మధ్యాహ్నం వరకు కూడా ఎన్‌రోల్‌మెంట్ ఆశించిన రీతిలో జరగలేదు. అప్పటివరకు పట్టభద్రుల స్థానానికి సంబంధించి 2,32,576 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కానీ, రెండు రోజుల్లో ఆ సంఖ్య ప్రస్తుతం 3,58,452కి చేరింది. అంటే 48 గంటల్లో 1,25,876 మంది కొత్తగా నమోదు చేసుకున్నారు. ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం వరకు ఉన్న పరిస్థితిని చూస్తే మరో 50వేల దరఖాస్తులు రావొచ్చని ఆశించారు. లేదా మూడు లక్షల ఎన్‌రోల్‌మెంట్ దాటక పోవచ్చని అంచనా వేశారు. కానీ, చివరి వరకు చూస్తే అధికారుల అంచనాలకు మించిపోయింది. 2019 ఎన్నికల్లో 1,96,321 మంది ఎన్‌రోల్‌మెంట్ చేసుకోగా, అప్పటితో పోలిస్తే ఈసారి 1,62,131 ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. అయితే తుది జాబితా ప్రకటించే వచ్చే నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తున్నది.

### పంతుళ్లలోనూ ఉత్సాహం

ఇదే పరిస్థితి ఉపాధ్యాయుల్లోనూ కనిపించింది. ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం వరకు చూస్తే.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం 16,150 ఎన్‌రోల్‌మెంట్ మాత్రమే జరిగింది. కానీ, 6వ తేదీ అర్ధరాత్రి వరకు ఆ సంఖ్య 27,879కి చేరింది. అంటే రెండు రోజుల్లో కొత్తగా 11,729 మంది ఓటు నమోదు చేసుకున్నారు. 2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను చూస్తే అప్పుడు 23,214 మంది టీచర్లు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. అప్పటితో పోలిస్తే ఈ సారి 4,665 మంది పంతుళ్లు అదనంగా నమోదయ్యారు.

### ఇంకా పెరిగే అవకాశం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు సంబంధించి ఈ నెల 6వ తేదీలోగా దాఖలైన దరఖాస్తులను పరిశీలించి, ఈ నెల 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. 23 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వచ్చే నెల 30న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. అయితే ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించే సమయంలోనూ అర్హులైన ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకో వచ్చని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ప్రక్రియ నామినేషన్ చివరి తేదీ వరకు కూడా కొనసాగుతుందని వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్లు ఫారం-18లో, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు ఫారం-19లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఓటర్ల నమోదు ఇంకా పెరుగుతుందని భావిస్తున్నారు.

### ఇక ప్రచారంపై దృష్టి

2019 ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి సంబంధించి 17 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈసారి అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిని పరిశీలిస్తే.. ప్రస్తుతం 15 కొత్త జిల్లాలున్నాయి. 271 మండలాలు, 43 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నది. ఈ నేపథ్యంలో చాలా మంది ఈ సారి ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానంలో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. రాజకీయ అనుభవం లేకపోయినా వైద్యులు, అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొత్తంగా 25 మందికిపైగా పోటీలో నిలిచే అవకాశం కనిపిస్తున్నది. మరోవైపు ప్రధాన పార్టీలన్నీ ఈ స్థానంపై ఫోకస్ పెడుతున్నాయి. లక్షలాది మంది పట్టభద్రులను ప్రసన్నం చేసుకొని ఈ ఎన్నికల్లో గెలువాలనే పట్టుదలతో ఉన్నాయి. ఇప్పటికే ఆయా పార్టీలు అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కూడా ఈసారి పోటీ బాగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయా సంఘాలు మద్దతు ఇవ్వకపోయినా.. స్వతంత్రులుగా బరిలో దిగేందుకు ఇప్పటికే చాలా మంది ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ పరిస్థితుల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ దాదాపు పూర్తి అయినట్టు భావిస్తున్న ఔత్సాహిక పోటీదారులు.. ఇక నుంచి తమ దృష్టిని ప్రచారం వైపు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎక్కడైతే ఎక్కువ ఓట్లు ఉన్నాయో.. ఆయా సంస్థలు, ఆయా వర్గాలను లక్ష్యంగా చేసుకొని వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టనున్నారు. ఇప్పటికే చాలా మంది అభ్యర్థులు వారివారి ప్రయత్నాల్లో మునిగి పోయారు.

## • వడ్ల కుప్పలు ఎక్కడియక్కడే!

ధాన్యం కుప్పలతో నిండిపోయిన మెట్‌పల్లి మండలం అల్లూరి సీతారామరాజు తండాలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం



కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కుప్పలు ఎక్కడివక్కడే పేరుకుపోతున్నాయి. దీంతో రైతులు నిత్యం అవస్థలు పడుతున్నారు. కేంద్రాలకు మిల్లుల కేటాయింపులో నెలకొన్న జాప్యంతో కొనుగోళ్లు జరపడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. మెట్‌పల్లి మండలంలోని 23 గ్రామాల్లో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం వరకు కిలో కూడా ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

-మెట్‌పల్లి రూరల్, నవంబర్ 7

# వేతనాలు పెంచాలని హమాలీల ధర్నా





కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 7 : పెరిగిన నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ హమాలీ కార్మికులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూంపెల్లి భూంరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ఐకేపీ సొసైటీ హమాలీల వేతనాలను పెంచి, పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జిల్లాలో సుమారు 5వేల మంది హమాలీ కార్మికులు ఐకేపీ సొసైటీల్లో హమాలీలుగా పనిచేస్తూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇక్కడ పంతం రవి, మిద్దె నర్సన్న, బీ శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

## వాహన రిజిస్ట్రేషన్ మార్పిడికి
# తంటాలు!

- హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌తో ఆన్‌లైన్ లేనివారికి తప్పని ఇక్కట్లు
- అప్పుడు నిర్లక్ష్యం.. ఇప్పుడు ఇబ్బందులు









“ వీణవంక మండలానికి చెందిన ఓ రైతు ఐదేండ్ల కింద తన వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ కొన్నాడు. అప్పుడు తన అన్నకొడుకు పేర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇటీవల తన పేరున మార్చుకుందామని ఆర్టీఏ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవా కేంద్రానికి వెళ్లాడు. అయితే, వాహనం కొన్న సమయంలో హై సెక్యూరిటీ నంబర్ ప్లేటును ట్రాక్టర్‌కు అమర్చి ఆన్‌లైన్ చేయించుకోలేదు. దీంతో ఇప్పుడా రైతు హై సెక్యూరిటీ ప్లేటు అమర్చుకుంటే తప్ప రిజిస్ట్రేషన్ అయ్యే పరిస్థితి లేదు.

కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఐదేండ్ల కింద గూడ్స్ వాహనం కొన్నాడు. ఇటీవల మరో పెద్ద గూడ్స్ వాహనం కొనాలని, పాత వాహనం అమ్మకానికి పెట్టాడు. మంచి బేరం కుదిరింది. కొనుగోలు చేసిన వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్లాట్ బుక్ కోసం ప్రయత్నించగా సమస్య వచ్చింది. ఆర్టీఏ ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఆ వాహన యజమాని చివరకు ప్రజావాణిలో సైతం అర్జీ పెట్టినట్లు సమాచారం. చేసేదేం లేక వాహన విక్రయ అగ్రిమెంట్‌ను క్యాన్సిల్ చేసుకున్నాడు.

తిమ్మాపూర్, నవంబర్ 7 : హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌తో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ లేని వారికి ఇక్కట్లు తప్పడం లేదు. కొత్త వాహనాల కొనుగోలు సమయంలో అధికారులు అవగాహన కల్పించక పోవడం.. వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా మార్పిడి రిజిస్ట్రేషన్ల కోసం తంటాలు పడాల్సి వస్తున్నది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ కార్యాలయాలతోపాటు హుజూరాబాద్, కోరుట్ల, రామగుండంలో ప్రాంతీయ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో కొత్త వాహనం కొనే వారి నుంచి ప్రభుత్వమే రుసుం తీసుకొని, ఒక కోడ్‌తో హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ అందిస్తుంది. అయితే, వాటిని బిగించుకోకుండా ఉన్న వాహనాలు ఉమ్మడి జిల్లాలో సుమారు 5 వేలు ఉంటాయని అంచనా. వీరందరూ ఏదేని సమయంలో వాహనాన్ని అమ్ముకున్నా.. ఇతరుల పేర మీదకు మార్చాలన్నా సాధ్యం కావడం లేదు.

### అవగాహన లేమి.. డీలర్ల నిర్లక్ష్యం

ఏ వాహనం కొన్నా రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌కు ఆన్‌లైన్‌లోనే రుసుం తీసుకుంటుంది. రిజిస్ట్రేషన్ తర్వాత ప్లేట్ ప్రింట్ అయ్యి కార్యాలయాలకు వచ్చేవి. ఇలా వచ్చే హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను ఐదారేండ్ల క్రితం వరకు ఆర్టీఏ కార్యాలయాల్లోనే థర్డ్ పార్టీ సంస్థ ఆధ్వర్యంలో బిగించేవారు. అయితే, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం మరోసారి వాహనాన్ని ఆర్టీఏ కార్యాలయానికి తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడి బిగించుకోవడం లేదని గమనించిన ప్రభుత్వం.. వాహనం అమ్మిన డీలర్లకే ఆ వాహన నంబర్ ప్లేట్లను బిగించే ప్రక్రియను అప్పగించింది. అయితే, ఆ నంబర్ ప్లేట్ల ప్రాముఖ్యతపై చాలా మంది గ్రామీణ ప్రాంత వాహనదారులకు అవగాహన లేక బిగించుకోలేదు. డీలర్లు సైతం వాహనం తీసుకువచ్చి, అడిగిన వారికే బిగించారు. బిగించుకోని వారికి సమాచారం ఇవ్వలేదు. దీంతో ఇప్పుడు ఆ వాహనాల యాజమాన్య బదిలీలు నిలిచిపోతున్నాయి. ఇలా నిలిచిపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. వెరసి రోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు, సిబ్బందిని బతిమాలాడినా వారి చేతిలో కూడా ఏమీ లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. ఈ సమస్య పెరిగిపోతుండడంతో రెండు నెలల కింద ఉన్నతాధికారులు ఓ కమిటీ వేయగా.. అది పరిష్కారానికి ఏ దారి చూపలేదు. అధికారులు చొరవ చూపి రిజిస్ట్రేషన్లు అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

### ఇబ్బందులు

చాలా మందికి నంబర్ ప్లేట్ ఎక్కడ బిగించుకోవాలో కూడా అవగాహన కల్పించడంలో అధికారులు, డీలర్లు విఫలమయ్యారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో డీలర్ల వద్దకు వెళ్తే తమ వద్ద లేవంటున్నారు. అటు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్తే డీలర్లకే పంపామంటున్నారు. వాహనానికి బిగించి ఆన్‌లైన్ చేయాల్సిన డీలర్ల నిర్లక్ష్యంతోనే ఇలా వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు.

### హైసెక్యూరిటీ ప్లేట్లనే బిగించుకోవాలి



వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ కూడా ప్రధానమైంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఈ ప్లేట్లు ఉంటేనే చెల్లుతాయి. కానీ, చాలామంది అవగాహన లేక నిర్లక్ష్యంతో ప్లేట్లను బిగించుకోలేదు. ప్రభుత్వం ముద్రించి ఇచ్చే ప్లేట్లను కాకుండా చాలా మంది స్టైల్‌గా కనిపించేలా ప్లేట్లు కొనుగోలు చేసి పెట్టుకుంటారు. సమస్య వచ్చినప్పుడు ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు వివరించి, పరిష్కారానికి కృషి చేస్తా. ఇప్పటికైనా తప్పనిసరిగా నెంబర్ల ప్లేట్లను బిగించుకోవాలి.

- పెద్దింటి పురుషోత్తం, డీటీసీ

## నగదు ఇస్తానని చెప్పి..
# ₹50 వేలు ముంచి



చెట్టుకు కట్టేసి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి

- గుర్తు తెలియని వ్యక్తి చేతిలో మోసపోయిన మహిళ
- చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 7 : నగదు ఇస్తానని చెప్పిన గుర్తు తెలియని వ్యక్తికి ₹50 వేలు ఫోన్‌పే చేసి ఓ మహిళ మోసపోయింది. బాధితురాలి కథనం మేరకు.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లిలోని శ్రీనివాస కిరాణా దుకాణానికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. ‘అర్జెంట్ డబ్బులు అవసరం ఉంది. మీకు నగదు ఇస్తా. ఒక నెంబర్‌కు ఫోన్ పే చేయండి’ అని నమ్మించాడు. దీంతో దుకాణంలోని మహిళ సదరు వ్యక్తికి ఫోన్ పే ద్వారా ₹50 వేలు పంపింది. తర్వాత మరో ₹30 వేలు ఫోన్ పే చేయాలని, అవి ఇవి కలిపి ఇస్తానని సదరు వ్యక్తి చెప్పడంతో తన లేవని చెప్పింది. తన డబ్బులు తనకు ఇవ్వాలని కోరడంతో ఆ వ్యక్తి నుంచి సమాధానం రాలేదు. ఎంత అడిగినా డబ్బులు ఇవ్వలేదు. ఇదే సమయంలో గ్రామస్తులు అక్కడికి చేరుకొని నిలదీశారు. అయినా స్పందన లేకపోవడంతో అతన్ని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గుర్తు తెలియని వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు. తర్వాత గ్రామస్తులు ఫోన్‌పే చేసిన నెంబర్‌కు ఫోన్ చేయగా బెట్టింగ్ కోసం డబ్బులు పంపించాడని, తాను ఇవ్వనని చెప్పి ఫోన్ కట్ చేశాడని తెలిపారు.


